క్లుప్తంగా

ప్రాక్టికల్స్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక ప్రాక్టికల్స్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసులు పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టండి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ నీలకంఠం

రామాయంపేట(మెదక్): విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం పెట్టాలని మండల విద్యాధికారి నీలకంఠం సూచించారు. సోమవారం మండలంలోని కోనాపూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఈ క్రమంలో ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈవో వెంట స్కూలు హెచ్‌ఎం, టీచర్లు ఉన్నారు.

పాలకమండలికి సన్మానం



సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న కార్యదర్శి తిరుపతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ పాలకమండలిని సోమవారం పంచాయతీ కార్యదర్శి తిరపతి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ సుధాకర్, వార్డు సభ్యులు మల్లమ్మ, బాలమురళి కృష్ణ, షాహీన్, స్వర్ణలత, పోచయ్య, విద్యాసాగర్‌రెడ్డి, దుర్గయ్య, భారతమ్మ పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

పెద్దశంకరంపేట(మెదక్): రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం అయింది. మేడి విజన్ ఐ హెల్త్ కేర్ సెంటర్ వారి సహకారంతో ఈ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సాంబయ్య గారి నర్సింలు, మోహన్, నారాయణ, ప్రభాకర్, మెడివిజన్ ఐ హెల్త్ కేర్ సెంటర్ డాక్టర్ దిలీప్, సిబ్బంది గిరీశ్ రావత్, ఉదయ్ కుమార్, ఆంజనేయులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



బహుమతులను అందిస్తున్న హెచ్‌ఎం

శివ్వంపేట(నర్సాపూర్): చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శివ్వంపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలచంద్రం అన్నారు. సోమవారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

పదో తరగతిలో ఉత్తీర్ణులు కావాలి

మనోహరాబాద్(తూప్రాన్): పదో తరగతిలో ఉతీర్ణులు కావాలని హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన యువకుడు సాదు హరికృష్ణ తన సొంతంగా పరీక్షా ప్యాడ్‌లను అందజేశారు.

నీటి సమస్య పరిష్కరించండి

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని సునీతారెడ్డి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు సోమవారం మున్సిపల్ అధికారులను కోరారు. కొన్ని రోజులుగా భగీరథ నల్లాల నుంచి నీటి సరఫరా కావడం లేదని తెలిపారు.

ఈ పాస్ మిషన్ ద్వారా ఎరువుల అమ్మకాలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): మండలంలో పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి, ఈ పాస్ విధానం ద్వారా ఎరువులను విక్రయించాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు దుకాణాల్లో యజమానులు తప్పనిసరిగా ఈ పాస్ ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలు జరపాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు స్థలం సేకరించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ విజయ్ కుమార్
- సర్పంచ్‌లను సన్మానించిన ఎంపీడీఓ



నిజాంపేటలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నిజాంపేట(మెదక్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థలం సేకరించి, వెంటనే పనులు చేపట్టాలని మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ విజయ్ కుమార్ కోరారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ఎంపీపీ సిద్ధరాములు, ఎంపీడీఓ జగదీశ్వర్ చారి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ మాట్లాడుతూ.. మండలంలో నేటికి 2 ఎకరాల వరకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అకౌంట్‌లో పడినట్లు తెలిపారు. మండలంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. నార్లాపూర్ సర్పంచ్ అమరసేనారెడ్డి మాట్లాడుతూ.. నార్లాపూర్, చల్మెడ గ్రామాలకు నూతనంగా రైతులకు 2 క్లస్టర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. రెండో విడత గొర్రెల పంపిణీలో 239 యూనిట్లకు 42 యూనిట్లు మంజూరయ్యాయి. మిగతా 197 యూనిట్లు రావాల్సిందన్నారు. మండల మహిళా సమైక్యలో నందిగామ గ్రామంలో జరిగిన అవినీతిని విచారణ చేపట్టినా.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని అధికారులు ఆగ్రహించారు. అవినీతి జరిగిన సొమ్మును రికవరీ చేయకుండా నోటీస్‌లతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఆరోగ్య ఉపకేంద్రం పనులు పూర్తయినప్పటికీ భవనాన్ని హెల్త్ సెంటర్‌కు అప్పజెప్పాలన్నారు. అనంతరం చల్మెడ గ్రామంలో ఎమ్మెల్సీ నిధుల్లో భాగంగా సీడీపీఓ నిధులను గ్రామ పంచాయతీ తీర్మానం చేయకుండానే డబ్బులను విడుదల చేయడంపై సర్పంచ్ నరసింహారెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సర్పంచ్‌లు తాము చేసిన పనులకు బిల్లులు రాక భూములు అమ్ముకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సర్పంచ్ బిల్లులను జారీ చేసేలా కృషి చేయాలన్నారు. అనంతరం సర్పంచ్‌ల పదవీకాలం వీడనున్న సందర్భంగా ఎంపీడీఓ జగదీశ్వర్ చారి సర్పంచ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సిద్ధరాములు

రైతులకు పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలి

వెల్దుర్తి(తూప్రాన్): కాస్తులో ఉన్న రైతులందరికీ పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. మాసాయిపేట మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లి శివారులో సర్వే నం.158లో పొజిషన్‌లో ఉన్న రైతులకు పట్టా పాస్ పుస్తకాలు అందజేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు 50 సంవత్సరాల నుంచి కాస్తులో ఉండి సాగు చేసుకుంటున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేసిందని, కానీ తెలంగాణ పాస్‌బుక్స్ ఇవ్వకుండా ఆపిందని అన్నారు. ఈ విషయమై రైతులు తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోయిందన్నారు. సర్వే నంబర్ 158 ఫారెస్ట్ పరిధిలో ఉందంటూ రైతులను మోసానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేసి రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు నాగమణి, ఐలయ్య, పోచయ్య, నర్సింలు, భిక్షపతి, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యే సమయం ఇవ్వడం లేదు’



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ

చిన్నశంకరంపేట(మెదక్): ఐదేళ్ల గ్రామాల అభివృద్ధికి కృషిచేసిన తమకు ఎమ్మెల్యే సమయం ఇవ్వడం లేదని మండలంలోని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చిన్నశంకరంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల సమస్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం సర్పంచ్‌లను సన్మానించనున్నట్లు ఎంపీపీ భాగ్యలక్ష్మి తెలిపారు. దీంతో సర్పంచ్‌లు లక్ష్మణ్, లక్ష్మీనర్సయ్య తదితరులు తాము చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రావాలని కోరినా ఎమ్మెల్యే రోహిత్ స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, సాయిలు, మీనా, నీరజ, నాగమణి తదితరులను ఎంపీపీ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ మన్నన్ పాల్గొన్నారు.

నర్సాపూర్ మండల సర్వసభ్య సమావేశం



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండల ప్రజాపరిషత్ సమావేశం ఎంపీపీ జ్యోతినాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుండడంతో వారిని సన్మానించేందుకు సమావేశం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ మార్టిన్ లూథర్ తెలిపారు. 2024 – 2025 సంవత్సరానికి సంబంధించి బ్లాక్ డెవలప్మెంట్ నిధులపై తీర్మానం చేశారు. అనంతరం సర్పంచ్‌లు తమ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై మాట్లాడారు. ఎంపీపీ, జెడ్పీటీసీ బాబియ నాయక్, ఎంపీడీఓ మార్టిన్ లూథర్, ఎంపీటీసీలు, కార్యదర్శులు కలిసి సర్పంచ్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, సర్పంచ్‌లు వెంకటేష్ గౌడ్, శ్యామల, విజయ భాస్కర్ రాజు, సేనాధిపతి, శివకుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

ఎంఈఓకు ఫిర్యాదు చేసిన తండావాసులు

కౌడిపల్లి(నర్సాపూర్): సమయపాలన పాటించకపోవడంతో పాటు నాలుగు నెలలుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకుండా బంద్ చేసిన ఉపాధ్యాయురాలు మాకొద్దంటూ తండావాసులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. సోమవారం మండల పరిధిలోని దేవులపల్లి కోమటికుంటతండా పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ రమేశ్, తండావాసులు హీరాలాల్, బాబు, ఎం రమేశ్, వాల్య, బాబుసింగ్, రవి, గోప్య, రాములు తదితరాలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయురాలు ప్రియాంక పాఠశాలకు ఇష్టం వచ్చినప్పుడు వస్తుందన్నారు. సమయనికి రావడం లేదని, విద్యార్థులకు చదువు చెప్పడం లేదని హోంవర్క్ ఇవ్వడం లేదన్నారు. నాలుగు నెలలుగా పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని వాపోయారు. అడిగితే నిర్లక్ష్యంగా మాట్లాడుతుందని చెప్పారు. తండావాసుల ఫిర్యాదుతో మూడు రోజులుగా మధ్యాహ్న భోజనం తండావాసులతో కాకుండా వేరేవారితో వండిస్తుందని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ బుచ్యానాయక్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ లేకపోవడంతో కంప్యూటర్ ఆపరేటర్‌కు నరేష్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాల తనిఖీ చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.



దేవులపల్లి కోమటికుంట తండా టీచర్‌పై ఫిర్యాదు చేస్తున్న తండావాసులు

సైబర్ నేరాలపై కళాజాత

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో మేలుకొలుపు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు, యువకులకు సైబర్ నేరాలపై కళాజాత నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సరస్వతీ కాన్వెంట్ హై స్కూల్లో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెదక్ పట్టణ సీఐ వెంకట్, కళాబృందం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ సురేందర్, హోమ్ గార్డ్స్ జనార్దన్, ఇసాక్, విఠల్, షీ టీం బృందం, స్కూల్ ప్రిన్సిపాల్ సుమిత్ర ప్రభాకర్, కరస్పాండెంట్ దత్తు, స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపేట(మెదక్): మండలంలోని చల్మెడ గ్రామంలోని తిరుమలనాథ స్వామి దేవస్థానానికి దేవదాయ శాఖ కమిషనర్ హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు ట్రస్ట్ బోర్డ్ నియమానికి దరఖాస్తు చేసుకోవాలని దేవదాయ శాఖ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని చల్మెడ గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అల్లాదుర్గం సీఐగా రేణుక



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం సీఐగా రేణుకా సోమవారం కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఉన్న సీఐ జార్జ్ ఐజీ కార్యాలయానికి బదిలీ చేయగా అక్కడి నుంచి రేణుకా అల్లాదుర్గంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపడుతామన్నారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తామన్నారు.

నర్సాపూర్ సీఐ బదిలీ

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పోలీస్ సీఐ షేక్ లాల్ మదర్ బదిలీ అయ్యారు. జోన్ వన్ ఐజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు అందినట్లు సోమవారం ఆయన తెలిపారు. గజ్వేల్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీఐ రంగ కృష్ణ నర్సాపూర్‌కు బదిలీపై వస్తున్నట్లు చెప్పారు.

మండల స్థాయిలో చెకుముకి పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలో సోమవారం జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో తెలుగు మీడియం ఇంగ్లిష్ మీడియంలో పోటీలను నిర్వహించారు. తెలుగు విభాగంలో కుర్తివాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, పొడ్చన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, యుసూఫ్‌పేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో కుర్తివాడ ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం లింగాయిపల్లి, తృతీయస్థానం యుసూఫ్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాంపెక్స్ హెచ్‌ఎం మహేశ్వర్, నర్సింలు, అశోక్‌కుమార్, లోక్యనాయక్, బాలనర్సయ్య, నాగేశ్వర్‌రావు, తులసీరాం పాల్గొన్నారు.

అభివృద్ధికి సర్పంచ్‌ల సేవలు అమోఘం



చిన్నశంకరంపేట(మెదక్): సర్పంచ్‌లను సన్మానిస్తున్న మండల పాలకవర్గం



కౌడిపల్లి(నర్సాపూర్): సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు అందించిన సేవలు అమోఘమైనవని నార్సింగి ఎంపీపీ సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీలు సుజాత, సత్యనారాయణ, సంతోషి, ఎంపీడీఓ అనందమేరి, ఎంపీఓ నరేశ్, ఎస్ఐ మోహినొద్దీన్, గ్రామ కార్యదర్శులు, అధికారులు, సర్పంచ్‌లు ఎర్రం అశోక్, మల్లేశం, షరీఫ్, సుజాత, భూలక్ష్మి, చత్రియా, భారతీ, మహేశ్వరీ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

సన్మానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామ సర్పంచ్ దివ్య దంపతులతో పాటు వార్డు సభ్యులను గ్రామస్తులు, యూత్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో ఐటీసీ పరిశ్రమల ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ, గ్రామ ప్రధాన వీధిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ స్ట్రీట్ లైట్లను, జిమ్‌ను సర్పంచ్, ఐటీసీ మేనేజర్ విజయ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్‌ఆర్‌లు సూర్యభగవాన్, శివనాగసాయి, మాజీ సర్పంచ్ అయిలయ్య, కార్యదర్శి రూపగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రభవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

పల్లె దవాఖాన ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లెదవాఖానను ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లె దావఖానాలను నిర్మించిదని, వాటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, నాయకులు బీటీ నర్సింలు, కనకరాజు, భూపాల్, శ్రీశైలం, గ్రామస్తులు పాల్గొన్నారు.



దవాఖాన ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

పోలీస్‌స్టేషన్ తనిఖీ

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఉదయం ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో విద్యుత్ సౌకర్యం, బిల్డింగ్ లీకేజీ వంటి ప్రాపర్టీస్, సిబ్బంది క్వార్టర్స్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్టేట్ అధికారిగా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశామన్నారు. స్థానిక స్టేషన్‌లో ప్రాపర్టీస్ అన్ని సజావుగా ఉన్నాయన్నారు. సిబ్బంది క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నందున గతంలోనే కూల్చివేతకు ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతీనెల ఆరు పోలీస్ స్టేషన్‌లు తనిఖీచేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. ఎస్ఐ మధుసూదన్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రాంచంద్రారెడ్డి ఉన్నారు.



పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న ఏఆర్ డీఎస్పీ రంగనాయక్

అనంతసాగర్‌లో వరిపంట పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని అనంతసాగర్ గ్రామంలో సోమవారం మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ వరిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుత యాసంగి సీజన్‌లోని వరి పంటలకు కాండం తొలి చేపురుగు ఉధృతిని గుర్తించినట్లు హరిప్రసాద్ తెలిపారు. ఈ పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. మొగి పురుగు నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఏఈఓ శోభారాణి రైతులు పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

సంక్షిప్త వార్తలు

◆ సుభాష్‌చంద్రబోస్ విగ్రహావిష్కరణ



చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఎంపీటీసీ భాగ్యమ్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్, శ్రీనివాస్, ముజాంబిల్, స్టాలిన్, స్వామి, పోచయ్య పాల్గొన్నారు.

◆ వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడికి సోమవారం శివ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వీరయ్యస్వామి స్వామివారికి అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ ఈశ్వరప్ప, శివస్వాములు రాజు, నాగరాజు, గణేశ్, రాము, ప్రశాంత్ పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్ సభ్యత్వ చెక్కు అందజేత

నిజాంపేట(మెదక్): మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త గుమ్ముల రాజు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మృతుడు భార్య రేవతికి రూ. 2 లక్షల బీఆర్‌ఎస్ సభ్యత్వ ఇన్సురెన్స్ చెక్కును సోమవారం ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధరాములు, వైస్ ఎంపీపీ ఇందిరారెడ్డి, సర్పంచ్ కవిత, మండలాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సొసైటీ చైర్మన్లు చంద్రం, కొండల్‌రెడ్డి, రైతు బంధు కోఆర్డినేటర్ సంపత్, చల్మెడ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యానికి కృషి



హవేళిఘణాపూర్(మెదక్): గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి తెలిపారు. సోమవారం మెదక్ మండలం మక్తభూపతిపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతలు, అన్నప్రాసన నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు మహేశ్వరి, అఖిల, ఎంఎల్ హెచ్‌పీ మౌనిక, ఆశవర్కర్ శ్యామల, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శివ్వంపేట(నర్సాపూర్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొంతి గ్రామానికి చెందిన జగని రవి(32) బైక్ మెకానిక్ కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 27న శభాష్‌పల్లి గ్రామ శివారులో అతను పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంచగా గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా సోమవారం మృతి చెందాడు. మృతుడు తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ ట్రాక్టర్, బైక్ ఢీ ఒకరి మృతి

నర్సాపూర్ రూరల్: ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి నర్సాపూర్ – మెదక్ రహదారిలోని ఎఫ్‌సీఐ గోదాం సమీపంలో జరిగింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన వడ్డే రాజు (40) బైక్‌పై నర్సాపూర్ వైపు వస్తుండగా, మెదక్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొని ప్రమాదంలో వడ్డే రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ భూకబ్జాను అడ్డుకున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని 490 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నించగా, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. నార్సింగి మండల కేంద్రంలోని రైస్‌మిల్ పక్కన ఉన్న 490 సర్వేనంబర్ ప్రభుత్వభూమిలో కొందరు పనులు నిర్వహిస్తున్నారని రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. తహసీల్దార్ కరీం వెంటనే రెవెన్యూ అధికారులను సంఘటన స్థలం వద్దకు పంపించి పనులు అడ్డుకున్నారు.